# శ్రీకృష్ణ స్వీయ చరిత్రము

---

కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి

ఎమెస్కో

# విషయసూచిక


| | |
|---|---|
| ప్రథమోల్లాసము | 15 |
| ద్వితీయోల్లాసము | 47 |
| తృతీయోల్లాసము | 82 |
| చతుర్థోల్లాసము | 115 |

# శ్రీకృష్ణ స్వీయచరిత్రము

## ప్రథమోల్లాసము

### ఇష్టదేవతా ప్రార్తనాదికము

శా. శ్రీయున్ దేవియువాక్కునై ప్రకృతి తన్ జేరంద్రిమూర్త్యాత్మకుం
డై యీరేడుజగంబులన్ లలి నిజప్రాప్తేంద్రజాలోదయో
పాయప్రక్రియఁ బెంపఁ ద్రుంపఁ గలిగింపఁ గర్తయై సర్వత
స్స్వీయత్తేజమునం బ్రకాశిలెడు నాసర్వేశ్వరుం గొల్చెదన్. 1

మ. పరమార్థప్రతిపాదకామలకృతిప్రాప్తప్రభావాధికో
త్తరకీర్తిం జనుపుణ్యమూర్తియును నద్వైతాత్ముఁడుం గావునన్
బరమందుం బరమాత్మునిం గలసి సంబంధంబునం బొందు మ
ద్గురునిన్ శ్రీపదవేంకటాధ్వరినిఁ గొల్తున్ భక్తి నశ్రాంతమున్. 2

ఉ. అమ్మకునమ్మ కెత్తగుచు యజ్ఞకృదాత్మజ యజ్ఞకర్త్రి య
జ్ఞమ్ముల కైనసామములు గానము సేయఁగఁ జాలి సాధ్వి యై
సమ్మతి సర్వధర్మములు సల్పిన వేంకటసుబ్బసోమిదే
వమ్మను నన్నుఁ గన్నతలి భావమునన్ భజియింతు భక్తిమై. 3

మ. క్రతుతంత్ర ప్రతిపాదితోత్తమ ఫలప్రాప్తప్రభావు ల్మహా
వ్రతసంపాదితపుత్రపౌత్రవిభవుల్ బ్రహ్మణ్యులు న్వేంకట
ప్రతిపాద్యాఖ్యులు వైదికప్రవరులై స్వర్గీయు లైనట్టి మ
త్పితృపాదుల్ శివయున్ శివుం డని మదిన్ బ్రేమించి భావించెదన్. 4

వ. అని దేవతాస్వరూపు లగు నా తల్లిదండ్రుల సమారాధనంబు గావించి సరస్వతీగణపతుల సేవించి కులగురుం దలంచి నా యొనర్పం బూనిన నా జీవితచరిత్రం బంతయు నన్నుఁ బ్రేమించు నా మాతాపితృదేవతల

కంకితంబు గావించుచు ముందు ముందు మంగళాచరణంబుగా మా
వంశవృక్షప్రదర్శనాభివర్ణనంబులు గావించెదఁ జిత్తగింపుఁడు. 5

## వంశ సంకీర్తనము

ఉ. శ్రీపరమేశ్వరుం డొకఁడు చిన్మయరూపముతో వెలుంగుచున్
గోపరిపాలనంబునను గోరికి చేసి ప్రపంచసృష్టికిన్
రూపముఁ గూర్చు నాక మపురూపముగా నొనరించె మున్ను ము
న్నాపయి గంధవాహుఁ డయి యగ్నిఁ దలిర్పఁగఁ జేసె నందునన్. 6

ఉ. అప్పులు పుట్టె నందున ననంతము వింతగ నయ్యె దానిపై
నిప్పుడు దృశ్యమాన మగు నీ జగ మంతయు నింతలోన నై
చెప్పఁగ నొప్పె నప్పుడు ప్రసిద్ధికి నౌ ప్రజ నాల్గుజాతులం
జొప్పడఁ జేసె వాసి గనుచున్ గుణకర్మవిభాగ మేర్పడన్. 7

తే. బ్రహ్మ రుద్రుఁడు శక్రుఁడు రవి యముండు
చంద్రుఁ డనిలుండు లోనగుసాము లెల్ల
దానయై యేలె బ్రహ్మముఖానఁ బుట్టి
బ్రాహ్మణులు నాల్గుజాతుల వాసి గనుచు. 8

తే. క్రమముగా వారు పదితెగల్ గాఁగ నగుచుఁ
బంచ గౌడలు ద్రావిడుల్ పంచగతుల
శాఖలై విస్తరిల్ల విశ్వంభరాంత
రమునఁ దద్వంశవృక్షముల్ ప్రబల నయ్యె. 9

సీ. శ్రీపాదవంశవృక్షాదిమవృత్తాంత
మత్యున్నతం బది సత్యగతిక
మశ్వత్థనామ మత్యైశ్వర్యకలిత మ
ధశ్శాఖ మవ్యయత్వప్రవరము
మూలము పేర్గలదై లసదున్నత
స్కంధప్రకాండసంబంధబంధు
రమ్ము మూలప్రకాండమ్ములు రెం డేను
స్కంధశాఖలు నుపశాఖ లెచ్చు